
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
మంగళవారం 4 ఫిబ్రవరి 2025



వేములవాడ ఆలయంలో రద్దీ

- వసంత పంచమి సందర్భంగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిపోయిన క్యూలైన్‌లు 7
- ప్రారంభమైన శివదీక్షలు



భక్తులతో రద్దీగా క్యూలైన్‌లు

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా
- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

8



సమస్యలు వింటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

మహాసభను విజయవంతం చేయాలి

కోనరావుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : లక్ష డప్పులు వేల గొంతుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి పేర్కొన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో సోమవారం లక్షల డప్పులు, వేయి గొంతులు సభను విజయవంతం చేయాలని కోరుతూ సన్నాహక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఈ నెల 7న హైదరాబాద్ నగరంలో నిర్వహించే ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్జల అశోక్, కొమ్ము స్వప్న, దేవరాజు, చెప్యాల రాజు, నవీన్, తేజ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా తొలిరోజు గణపతి హోమం, గోమాతపూజ, స్థలదోష పరిహారం తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని ప్రభుత్వ భూమిలో ఓ వర్గం వారు ఎలాంటి అనుమతి లేకుండా చేపట్టిన భవన నిర్మాణాన్ని తొలగించి గ్రామ అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మరో సామాజిక వర్గం వారు కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని గ్రంథాలయం, బస్టాండు నిర్మాణాలకు కేటాయించాలని కోరారు.



నిర్మాణం పూర్తయిన వర్క్‌షెడ్లు

నేతన్నలు యజమానులుగా మారేనా..?



కండెల మిషన్

- మరోసారి సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల్లో ఆశలు
- రూ.386.88 కోట్లతో పథకం అమలుకు కసరత్తు
- మొదటి విడతలో 1,104 మంది లబ్ధిదారులకు అవకాశం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వస్త్ర సంక్షోభంలో ఆత్మహత్యలతో ఏడాది కాలంగా అతలాకుతల మైన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు మొదలయ్యాయి. గత ప్రభుత్వం అందించిన ప్రభుత్వ ఆర్డర్లలో మార్పులు తీసుకవచ్చి కొత్త ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడమే కాకుండా పాత బకాయిలను సైతం అందించింది. ఇటీవలే స్వశక్తి సంఘాల మహిళలకు 1.30 కోట్ల చీరల ఆర్డర్లలో మొదటి విడతను అందించింది. విద్యుత్ సమస్యను పరిష్కరించే దిశగా పది హెచ్‌పీల వరకు రాయితీ వర్తించే విద్యుత్ సౌకర్యాన్ని 25 హెచ్‌పీలకు పెంచారు. తాజాగా సిరిసిల్ల నేత కార్మికు లు ఎదురు చూస్తున్న వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అందించే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడంతో సిరిసిల్ల నేతన్నల్లో మళ్లీ యజమానులుగా మారుతామనే ఆశలు మొదలయ్యాయి. నేత కార్మికులను యజమానులుగా మార్చడానికి గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టూ ఓనర్ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం, నిర్మాణం పూర్తి చేసుకున్న షెడ్లలో ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడంతో పవర్‌లూం కార్మికుల్లో పథకంపై ఆశలు సన్నగిల్లాయి. తాజాగా ప్రభుత్వం రూ.386.88 కోట్లతో పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే పథకాన్ని అమలు చేయడానికి సన్నాహాలు ప్రారంభిస్తుందని తెలియడంతో కార్మికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. మరోవైపు ప్రభుత్వం సిరిసిల్ల పవర్‌లూం కార్మికులకు ప్రభుత్వ ఆర్డర్లు అందించడం ప్రారంభించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలు నాణ్యతగా లేవని రద్దు చేసింది. వాటి స్థానంలో స్వశక్తి సంఘాల మహిళలకు సంవత్సరానికి రెండు చీరలు అందించాలని నిర్ణయించడమే కాకుండా ఆర్డర్లను కూడా ఇచ్చింది. ఈ క్రమంలో గత ప్రభుత్వం ప్రారంభించిన వర్కర్‌టుఓనర్ పథకం నిరుపయోగంగానే మారిపోయిందనే నిరాశలో ఉన్న కార్మికులకు పథకాన్ని మరోసారి ముందుకు తీసుకవచ్చింది. 25 నుంచి 50సంవత్సరాలలోపు ఉన్న పవర్‌లూం కార్మికులకు అవకాశం ఇవ్వనున్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఐదేళ్ల అనుభవం ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది.

రూ. 374 కోట్లతో నిర్మాణం

దేశంలోనే ఎక్కడా లేని విధంగా మరమగ్గాల కార్మికులను యజమా నులుగా మార్చే దిశగా గత ప్రభుత్వంలో వర్కర్ టూ ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. 42 వీవింగ్ షెడ్లు నిర్మాణం జరిగింది. కార్మికులకు నచ్చే విధంగా సెమీ ఆటో మరమగ్గాలను..

మిగతా 8లో

మహిళల భద్రతకు భరోసా

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు పోలీస్ అక్క , షీటీంలు భరోసా ఇస్తున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత నెల రోజుల వ్యవధిలో మహిళలను వేధింపులకు పాల్పడిన సంఘటనల్లో మూడు కేసులు, 8 ఈ-పెట్టి కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలలోనూ, పనిచేసే ప్రదేశాల్లోనూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. వేధింపులకు గురైతే వెంటనే షీటీం లేదా పోలీస్ అక్క అనే విభాగాలైన 87126 56425కు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో మహిళలు, విద్యార్థుల రక్షణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన షీటీం, పోలీస్ అక్క అనే విభాగాలు పనిచేస్తాయన్నారు. ఇందులో భాగంగానే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, మహిళ చట్టాలు, పోక్సో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వేధింపులకు గురైతే ఎవరిని సంప్రదించాలనే అంశాలపై అవగాహన కల్పించి మహిళలకు, విద్యార్థినిల భద్రతకు భరోసా కల్పిస్తున్నామన్నారు. నెల రోజుల్లో విద్యా సంస్థల్లో దాదాపు 134 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఇబ్బందులు ఎదురైనపుడు మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని, సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. షీటీం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలి

సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి స్థానిక ఎన్నికల సన్నద్ధతపై అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్)లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామ పంచాయతీలలో 2వ సప్లిమెంట్ ఓటర్ జాబితా నమోదు, మండలాలకు ఎంపీటీసీల కేటాయింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన మ్యాన్‌పవర్, బ్యాలెట్ బాక్సుల సన్నద్ధత , సిబ్బందికి అవసరమైన శిక్షణ, రిటర్నింగ్ అధికారుల నియామకం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పంచాయతీ, స్థానిక సంస్థ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపీటీసీ పరిధి చెక్ చేసుకోవాలని, ఎంపీడీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, అధికారులు

మండల స్థాయిలో అందుబాటులో ఉన్న సిబ్బంది ఎన్నికల సమయంలో ఏ బాధ్యతలను నిర్వర్తించాలో స్పష్టమైన ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎన్నికలు వస్తే చేయాల్సిన పనులను మండల పంచాయతీ అధికారి, ఎంపీడీవోలు కలిసి లిస్ట్ అవుట్ చేసుకోవాలని, ప్రతి పనికి ఒక అధికారికి బాధ్యతలు అప్పగించాలని, అవసరమైన సిబ్బంది, మెటీరియల్ వివరాలు అందించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో 2వ దశ సప్లిమెంట్ ఓటర్ జాబితా తయారు చేయాలని, పోలింగ్ కేంద్రాల ఓటర్లను మ్యాప్ చేయాలని, దివ్యాంగ ఓటర్లకు కల్పించాల్సిన వసతులపై ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ కార్యదర్శి అందించిన సూచనలను నోట్ చేసుకున్నామని, క్షేత్ర స్థాయిలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ రాబోయే ఎన్నికలకు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలో మొదటి దశలో 137 గ్రామాల్లో 1188 వార్డులలో, రెండవ దశలో 123 గ్రామాల్లో 1080 వార్డులలో ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామని, సిరిసిల్ల జిల్లాలో అవసరమైన మేర సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ జిల్లా పంచాయితి అధికారి శేషాద్రి, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డిప్యూటీ జడ్పీ సీఈవో గీతా పాల్గొన్నారు.

టీజీ పెటా క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి బీ జగన్మోహన్‌రెడ్డి సోమవారం కార్యాలయం ఆవరణలో టీజీపెటా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2025-26 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీపేటా జిల్లా అధ్యక్షుడు దుప్పటి రవికుమార్, ఉపాధ్యక్షులు ఎస్ రాజు, సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి నాంపల్లి శ్రీనివాస్, కోశాధికారి తడకల శ్యాంసుందర్, కార్యదర్శులు బి పరశురాములు, ఎల్ రమేష్ పాల్గొన్నారు.

7న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఈనెల 7న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఉంటుందని చైర్‌పర్సన్ నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు హాజరుకావాలన్నారు.

రంగనాయక సాగర్ కాలువ నీటిని

చెరువుల్లోకి తరలించాలి

- కలెక్టర్‌కు విన్నవించిన రెండు గ్రామాల ప్రజలు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రంగనాయక సాగర్ కాలువ నుంచి తంగళ్లపల్లి మండలంలోని రాంచంద్రాపూర్, చిన్నలింగాపూర్ గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు వచ్చేవిధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు సోమవారం తంగళ్లపల్లి మండలం రాంచంద్రపూర్, చిన్నలింగాపూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాంచంద్రపూర్, చిన్నలింగాపూర్ గ్రామాలల్లో సుమారు 500 ఎకరాల వరకు వరినాట్లు వేసి రెండు నెలలు అవుతుందని చెరువుల్లో నీళ్ల లేక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంటలు ఎండుతున్నాయన్నారు. ప్రతిరోజు రాత్రిపూట త్రీఫేజ్ కరెంట్ రావడంతో అసమయంలో తాము పొలాలకు వెళ్లి కరెంట్ పెట్టి నీళ్ల పారిచండానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి దాచారం శివారులోని బాణప్ప చెరువుకు నీళ్ల నింపిన మాదిరిగానే మా గ్రామాల్లోని చెరువుల్లోకి నీళ్లను తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పొన్నాల మహేష్, సురేష్, చందు, మాధవ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

గంభీరావుపేట ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన దండ్ల నర్సింలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 'మన ఊరు మన నర్మాల' వాట్సాప్ గ్రూప్ మృతుడు నర్సింలు కుటుంబానికి అండగా నిలిచింది. గ్రూప్ సభ్యులు సోమవారం రూ. 9 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నర్సింలు నిరుపేద కుటుంబం కావడంతో వాట్సాప్ గ్రూప్ ద్వారా సభ్యులు చేయూత అందించారు.

మల్కపేట జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలకు సాగు నీరు అందేలా చూడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుండారం, దేవునిగుట్టతండా, చింతకుంటతండా, తిమ్మాపూర్, రాజన్నపేట, గొల్లపల్లి, అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, కిష్టునాయక్‌తండా గ్రామాల్లోని రైతులకు చెందిన సుమారు 800 ఎకరాల వరి పంట ఎండి పోయే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వివరించడంతో ఈ నెల 2న జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. పంటలు ఎండిపోకుండా చర్యలు చేపడుతామని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారని నర్సయ్య పేర్కొన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు గౌస్, సాహెబ్, బుచ్చాగౌడ్, బాబు, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, మల్లేశం, కిషన్, మహబూబ్, వెంకటేశ్, శ్రీపాల్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ బీసీ విభాగం జిల్లా నాయకుడు దొరగొల్ల బాలయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో సోమవారం మాట్లాడారు. స్థానిక సంస్థల్లో మేమెంతో మాకంత పద్ధతిలో 52 శాతం రిజర్వేషన్ విధానాన్ని అమలు పరుచాలని, బీసీ బంధును కొనసాగించాలని పేర్కొన్నారు. బీసీలకు ఇచ్చిన హామీను వెంటనే నెరవేర్చాలని సీఎంను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

గృహ నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి

- అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు వినతి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల లేబర్ అడ్డా మీద పనిచేస్తున్న స్థానిక గృహ నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అండర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. సోమవారం సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సిరిసిల్లలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నజీర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కార్మికులు అతి తక్కువ కూలీలతో పనిచేస్తుండడంతో స్థానిక కార్మికులకు ఉపాధి తగ్గిపోతుందన్నారు. నెలలో కనీసం పదిరోజులు కూడా పని దొరకడం లేదన్నారు. సిరిసిల్లలో వలస కార్మికుల చట్టాన్ని అమలు చేసి స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ అధికారికి వినతిపత్రం అందించామన్నారు. అదే విధంగా సిరిసిల్ల లేబర్ అడ్డా వద్ద కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని కోరామన్నారు. కార్మికులకు లేబర్ కార్డులు లేని వారికి లేబర్ కార్డులు ఇవ్వాలని లేబర్ కార్డులు ఉన్నవారు రెన్యువల్ చేయించుకొనే విధంగా అవగాహన సదస్సులను నిర్వహించాలని కోరామన్నారు. సిరిసిల్లలో గృహ నిర్మాణాలు చేయడానికి నెలకు ఒక్క వారం మాత్రమే ప్రభుత్వం ఇసుకు అనుమతి ఇవ్వడం వల్ల కార్మికులకు పనిలేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా సహాయం కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, యూనియన్ అధ్యక్షుడు కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న కార్మిక నాయకులు

బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

- ఎన్నికల రాష్ట్రాలకే అధిక బడ్జెట్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణను పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం టీపీసీసీ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ చౌరస్తా వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహానిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ విప్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తదతరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఫ్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం అనాపైసా ఇవ్వకుండా విస్మరించిందని అన్నారు. బీహార్, ఢిల్లీలో ఎన్నికలు ఉండడంతో ఆ రాష్ట్రాలకు పెద్దపీట వేసిందని అన్నారు. ప్రతి బడ్జెట్‌లోనూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపెడుతోందని అన్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేసిన అన్యాయాన్ని చూసి సిగ్గుపడాలని అన్నారు. 8 మంది ఎంపీలు ఇద్దరు మంత్రుల చేతగానితనంతోనే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భేషజాలకు పోకుండా ఒక సభలో నరేంద్రమోదీని తెలంగాణ రాష్ట్రానికి పెద్దన్న పాత్ర పోషించాలని కోరినట్లు తెలిపారు. హైదరాబాద్ విశ్వనగరంగా ముందుకు పోతున్నా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్య నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్మాల స్వరూప రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్య క్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్లు కత్తెర దేవదాస్, యెల్లె లక్ష్మీనారాయణ, అడెపు చంద్రకళ, మాజీ జడ్పీటీసీలు నాగంకుమార్, రుక్మిణి, పట్టణ కార్యదర్శి మ్యాన ప్రసాద్, చందన, కమలాకర్, బాల్‌రెడ్డి, గోనె ఎల్లప్ప, గోలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో దినసరి కూలీ ఆత్మహత్య

● నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు అనుమానం



సురేశ్‌నాయక్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో దినసరి కూలీ బానోతు సురేశ్‌నాయక్(35) అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మం డలం కిష్టునాయక్ తండాలో సోమవారం వెలుగు చూసింది. నాలుగు రోజుల క్రితం గ్రామశివారులో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని సురేశ్‌నాయక్ దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో నాలుగురోజుల క్రితం సురేశ్‌నాయక్ భార్య సుజాత ఇద్దరుపిల్లలను తీసుకుని కామారెడ్డిజిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేటలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపంచెందిన సురేశ్‌నాయక్ తనబైక్‌పై గ్రామశివారులోని ఎర్రగుట్ట ప్రాంతానికి చేరుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెలు, మేకల కాపారులకు బైక్ కనిపించడంతో పాటు దుర్వాసన రావడంతో అక్కడకు చేరుకున్నారు. స్థానిక పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల సహాయంతో సురేశ్‌నాయక్‌గా గుర్తించారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు, తల్లి సరోజన ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కొడిమ్యాలలో యువకుడు..

కొడిమ్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన చిర్ర సంతోష్(25) సోమవారం అప్పుల బాధతో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సౌందర్య తెలిపారు. మృతుడి తల్లి చిర్ర మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆస్తి పంపకాల్లో వచ్చిన డబ్బు అప్పులకు సరిపోని కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఉరేసుకొని ఒకరు..

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన చింతరెడ్డి అశోక్‌రెడ్డి(45) 15ఏళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లోఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామంలో అప్పుల బాధతో అల్లె సాగర్ (28) అనే యువకుడు ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్గటూర్ ఎస్‌ఐ ఉమాసాగర్ కథనం మేరకు సాగర్‌కు మూడు నెలల క్రితం వివాహం జరిగింది. భార్య రెండు నెలల గర్భిణి. నెల రోజుల క్రితం తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. ఇటీవలే ఓ ఇంటిని కూడా కొనుగోలు చేశారు. వివాహం, ఇంటి అప్పు రూ.6 లక్షలు కావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. తండ్రి సోమవారం గల్ఫ్ నుంచి వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పర్మిట్ రూంలో వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ వైన్స్‌షాపు పక్కన గల పర్మిట్ రూంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిసిన వివరాల ప్రకారం.. నామాపూర్ గ్రామానికి చెందిన తీపిరి నారాయణ(53) సోమవారం వేకువ జామున పర్మిట్‌రూంలోకి వెళ్లాడు. ఉదయం ఎనిమిది గంటలకు అందులో పనిచేస్తున్న వ్యక్తి వచ్చే సరికి అచేతన స్థితిలో పడిపోయినట్లు తెలిపారు. ఫిట్స్‌తో , లేదా గుండెనొప్పితో చనిపోయినట్లు మృతుని కొడుకు శ్రీకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సోమవారం పోలీసులు, సివిల్ సప్లయిస్ సిబ్బంది పట్టుకున్నారు. కోదాండరామాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25క్వింటాళ్ల పీడీఎస్‌బియ్యం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బియ్యం, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఈ తనిఖీల్లో మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష

● బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనంప్రకారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ బాలికపై 2020సంవత్సరంలో సుంకల శ్రీనివాస్(21) అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి జగిత్యాల టౌన్ సీఐ జయేష్‌రెడ్డి నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సోయాక్ట్‌ల కింద కేసునమోదు చేయగా డీఎస్పీలు ప్రకాష్, వెంకటరమణ విచారించారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను ఫాస్ట్‌ట్రాక్‌స్పెషల్‌కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణరావు తమవాదనలు వినిపించగా నేరంరుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

వరకట్నం వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఒకరికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ సోమవారం తీర్పు వెలు వరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గాలిపెల్లి అంజయ్యకు 25ఏళ్ల క్రితం మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన నీరజతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత అదనంగా వరకట్నం తేవాలంటూ అంజయ్య తన భార్య నీరజను తరచుగా వేధించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన నీరజ 2020 మార్చి 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంత బాధిత కుటుంబ సభ్యులు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ తమ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

శాతవాహనలో ప్రక్షాళన జరిగేనా?



● పరీక్షల నియంత్రణ విభాగంపై ఫిర్యాదులు ● కొనసాగుతున్న విజిలెన్స్ ఎంక్వైరీ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఏ విశ్వవిద్యాలయానికి అయినా పరీక్షల నియంత్రణ విభాగమే కీలకం. శాతవాహన విశ్వవిద్యాలయంలో పేపరు లీకేజీ, పరీక్షల జవాబు పత్రాల డిజిటలైజేషన్ స్కానింగ్ టెండర్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. విశ్వవిద్యాలయానికి కొత్త ఉప కులపతి వచ్చినా పరీక్షల నియంత్రణ విభాగం ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు.

గత వీసీ హయాంలో ఓ అధికారి అన్నీ తానై వ్యవహరించేవాడు. ఆయన హయాంలో జరిగిన డిగ్రీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ పెను సంచ లనంగా మారింది. దీనిపై అప్పటి ఉపకులపతి, రిజిస్ట్రార్ ఒక కమిటీ వేశారు. ఆ విచారణ ముందుకు సాగలేదు.

జవాబు పత్రాల డిజిటలైజేషన్‌పై ఫిర్యాదులు

గత వీసీ హయాంలో కోసిన్ లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థకు నామినేటెడ్ పద్ధతిలో జవాబు పత్రాలు డిజిటలైజేషన్ ప్రక్రియను అప్పజెప్పారు. ఇలా నాలుగు విద్యాసంవత్సరాలకు సంబంధించిన పరీక్షలను మూల్యాంకనాన్ని ఆ సంస్థ ద్వారానే కొనసాగించారు. నిబంధనల ప్రకారం ఐదు లక్షల రూపాయలకు మించిన ఏ పనిని అయినా టెండర్ నిర్వహించి అప్పజెప్పాలి.

ఒక విద్యా సంవత్సరంలో రెం డు సెమిస్టర్ల ద్వారా జరిగే యూజీ, పీజీ, ప్రొఫెషనల్ పరీక్షల జవాబు పత్రాలు లక్షల్లో ఉంటాయి. వీటి డిజిటలైజేషన్‌కు కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ ప్రక్రియను నామినేటెడ్ పద్ధతిపై ఒక సంస్థకు అప్పజెప్పడం పలు అనుమానాలకు దారి తీసింది. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు సామాజిక కార్యకర్తలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేయడంతో అప్పటి వీసీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. సరైన స్పందన రాలేదనే సాకు మళ్లీ అదే సంస్థకు నామినేషన్‌పై అప్పజెప్పారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆదేశాలతో ఒక కమిటీని నియమించి పరీక్ష జవాబు పత్రాల డిజిటలైజేషన్ కోసం టెండర్ నోటిఫికేషన్‌ను జనవరి 17న ఇచ్చారు.

చర్యలు ఉంటాయా?

పరీక్షల నియంత్రణ విభాగం, విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాల మీద సామాజిక కార్యకర్తలు పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించింది. గతలో పని చేసిన అధికారులు ఈ విచారణకు సహకరించ లేదనే విమర్శలున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. అన్ని రకాల అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ఐదేళ్ల వయసు ఉన్న బాలుడు చేకూటి మోక్షిత్ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వాహనంలో సిరిసిల్లకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. నిజామాబాద్‌కు చెందిన చేకూటి మమత తన పిల్లలను తీసుకుని హరిదాస్‌నగర్ గ్రామానికి బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యానికి వచ్చింది. ఆమె కొడుకు మోక్షిత్ రోడ్డు దాటుతున్న క్రమంలో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంతునిపేట గ్రామానికి చెందిన వడ్లకొండ లక్ష్మయ్య అనే గీత కార్మికుడు ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారీ కింద పడగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి లక్ష్మయ్యను పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెళ్లి చేసుకోవాలని యువతి న్యాయ పోరాటం



బిడ్డతో కలిసి న్యాయ పోరాటం చేస్తున్న శిరీష

ధర్మారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన వ్యక్తి వివాహం చేసుకోవాలని 8 రోజులుగా ఓ మహిళా అతడి ఇంటి ఎదుట న్యాయ పోరాటం చేస్తున్న ఘటన మేడారంలో చోటుచేసుకుంది. మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆవుల శిరీషకు మేడారం గ్రామానికి చెందిన రాచూరి వెంకటేష్‌లు ప్రేమించుకున్నారు. అనంతరం శిరీషకు హన్మకొండకు చెందిన వ్యక్తితో వివాహం కాగా వెంకటేష్ శిరీష భర్తకు ఫోన్ చేసి విడాకులు ఇవ్వాలని కోరాడు. విడాకుల అనంతరం శిరీష వెంకటేష్ ఇంట్లో ఉంటూ రెండు సంవత్సరాలుగా సహజీవనం చేస్తోంది. వీరికి రెండు సంవత్సరాల పాప ఉంది. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని శిరీష వెంకటేశ్‌ను ఒత్తిడి చేసింది. ఈ విషయంలో ఇరువురి మధ్య నెలరోజులుగా గొడవలు అవుతున్నాయి. ఈ క్రమంలో శిరీష తల్లిగారు ఇళ్లు బొట్లవనపర్తికి వెళ్ళింది. గత నెల 26న శిరీష పెద్ద మనుషులతో కలిసి వెంకటేష్ ఇంటికి వెళ్ళగా తాళం వేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి శిరీష వెంకటేష్ ఇంటి ఎదుట న్యాయ పోరాటం చేస్తోంది. ఎనిమిది రోజులుగాకూతురుతో బొట్లవనపర్తి నుంచి వెంకటేశ్ ఇంటికి ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉండి వెళుతోంది. వెంకటేష్ సామాజికవర్గమైన మున్నూరు కాపు సోదరులారా నాకున్యాయం చేయండి, మేడారం గ్రామప్రజలారా న్యాయం చేయండి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తోంది. వెంకటేశ్‌తో వివాహం అయ్యే వరకు పోరాటం చేస్తానని, తన చావైనా బతుకైన వెంకటేశ్‌తోనే అని పేర్కొంది. అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతోంది.

తాత వద్దకు చేరిన ధృవన్

● అప్పగించిన ఏఎస్పీ శుభం ప్రకాష్
● పోలీసుల అదుపులో నిందితులు?



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండన్నపల్లి గ్రామశివారులో గతనెల27న హత్యకుగురైన మమత కొడుకు ధృవన్ క్షేమంగా ఉన్నాడు. కరీంనగర్ రూరల్ ఏసీపీ కార్యాలయంలో ఏఎస్పీ శుభం ప్రకాష్ సోమవారం బాలుడిని తాత, నానమ్మలకు అప్పగించారు. అనంతరం ఆయన సంఘటన వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఖాసీంపేటకు చెందిన మమత (25), భరత్ ఆరేళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల కుమారుడు ధృవన్ ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో నాలుగు నెలల నుంచి వేరుగా ఉంటున్నారు. మమత తన కొడుకుతో మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. గత నెల 25న బంధువుల ఇంటి నుంచి మమత ఆమె కొడుకుతో సహా బయటకు వెళ్లింది. అనూహ్యంగా కొండన్నపల్లి శివారులో హత్యకు గురైంది. మమత వెంట ఉన్న బాలుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు ప్రత్యేక పోలీసు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. చెన్నైలో ఒకహోటల్‌లో ఉన్న నిందితులతో పాటే బాలుడు ఉన్నట్లు గుర్తించారు. పథకం ప్రకారం ఆదివారం వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా అప్రమత్తమైన నిందితులు బాలుడిని హోటల్ గదిలో వదిలేసి పారిపోయారు. బాలుడిని కరీంనగర్ తీసుకొచ్చి నానమ్మ, తాతయ్య మేడ రాంచందర్, లక్ష్మీకి అప్పగించామని ఏఎస్పీ తెలిపారు. కేసు విచారణ కొనసాగుతున్నదని, మమత హత్యకు కారణమైన నింది తులను త్వరలో పట్టుకుంటామని, పూర్తి వివరాలు వెల్లడిస్తామని వివరించారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు, వారిలో ఒక మహిళ ఉన్నట్లు తెలుస్తోంది.

అఘోరీ హల్‌చల్

● వేములవాడకు వెళ్తుండగా సిరిసిల్ల జిల్లా సరిహద్దులో అడ్డుకున్న పోలీసులు ● మూడు గంటల పాటు ఉద్రిక్తత



అఘోరీని సిద్దిపేట వైపు తరలిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆలయంలోని దర్గాను కూల్చి వేస్తానని అఘోరీ సోమవారం వేములవాడకు వెళ్తుండగా పోలీసులు జిల్లా సరిహద్దులో అడ్డుకున్నారు. రాష్ట్రంలో సంచలనంగా మారిన అఘోరీ ఫిబ్రవరి 3వతేదీన వేములవాలోని దర్గాను కూల్చి వేస్తానని సంచలన వాఖ్యలు చేయడంతో పోలీసులు ముంద స్తుగా జిల్లా సరిహద్దుతోపాటు తంగళ్లపల్లి, జిల్లెల్ల ప్రాంతాల్లో ప్రత్యేకపోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. అఘోరీ ప్రకటించిన విధంగానే సోమవారం సాయంత్రం వేముల వాడకు వస్తుండగా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని జిల్లా సరిహద్దులో అఘోరీని పోలీసులు అడ్డుకున్నారు. అఘోరీ కారులోనే కూర్చోగా పోలీసులు కారును చుట్టుముట్టారు. సుమారు మూడు గంటల పాటు కారులోనే ఉన్న అఘోరీ పోలీసులు నచ్చజెప్పినప్పటికీ కారుదిగలేదు. పోలీసులు రికవరీ వ్యాన్‌ను తెప్పించి కారును అఘోరీతో పాటు సిద్దిపేట వైపు తరలించారు. అఘోరీని చూడడానికి ప్రజలు ఆసక్తి చూపడంతో రోడ్డుపై వాహనాలు నిలిచి పోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

వేములవాడలో పోలీసుల బందోబస్తు

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయంలోని ఫిబ్రవరి 3వతేదీన దర్గాను కూల్చివేస్తానని అఘోరీ చేసిన వాఖ్యలతో వేములవాడలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం అఘోరీ వేములవాడకు వస్తుండగా జిల్లా సరిహద్దులో పోలీసులు అడ్డుకున్నారు. అఘోరీ వ్యాఖ్యలు స్థానికంగా ఉత్కఠ రేపుతున్నాయి. పోలీసులను తప్పించుకుని అఘోరీ వేమలవాడకు చేరుకుంటుందా అనే చర్చ జరుగుతోంది.

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



వడుకాపూర్ గ్రామ శివారులో ప్రమాదానికి గురైన కారు

జూలపల్లి, ఫిబ్రవరి 3. (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్ శివారులో సోమవారం రాత్రి కరీంనగర్‌కు వెళ్తున్నకారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్ళింది. మద్యం మత్తులో వేగంగా కారు నడపడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపోయి కారు సమీప పొలాల్లోకి దూసుకువెళ్ళిందని స్థానికులు తెలిపారు. కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని, కారుకు మాత్రం ముందు భాగం దెబ్బతిన్నదని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎవరూ గాయపడలేదని ఏఎస్‌ఐ చంద్రమౌళి పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన బెజ్జంకి మహేష్(22) హత్యకేసు నిందితులను పోలీసుల అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. బొమ్మకల్‌లోని పంచాయతీ కార్యాలయం సమీపంలో గ్రామానికి చెందిన మహేష్, సతీష్ మరో ఇద్దరు స్నేహితులు కలిసి ఆదివారం మధ్యాహ్నం మద్యంతాగారు. గ్రామంలో నెల రోజులకిందట వివాహేతర సంబంధం బయట పడిన విషయంవారి మధ్యచర్చకు వచ్చింది. తనతోనే ఉంటూ వివాహేతరసంబంధం బయట పెట్టావంటూ సతీష్ అనేవ్యక్తి ఆవేశానికిలోనై బెజ్జంకి మహేష్‌ను బీరుసీసాతో గొంతుకోసి హత్యచేశాడు. మహేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో సతీష్‌తో పాటు మరోఇద్దరిపై కరీంనగర్‌రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్ మృతదేహానికి సోమవారం కరీంనగర్‌ప్రభుత్వాస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలో గొడవలు చోటు చేసుకోకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గ్రామానికిచెందినస్వాతి(36)చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలిభర్త మద్యానికి బానిస కాగా ఎన్ని సార్లు చెప్పిన వినకపోగా అతనిపై విసుగుచెంది ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. మృతు రాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పట్టపగలే చోరీ

జూలపల్లి, ఫిబ్రవరి 3. (ఆంధ్రజ్యోతి) మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన దుంపెట తిరుపతి ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం తిరుపతి బంధువు వివాహం అదేగ్రామంలో జరగగా అక్కడికి వెళ్ళి ఇంటికి తిరిగివచ్చారు. ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు బీరువాలోని లక్షరూపాయల నగదును ఎత్తుకె ళ్లారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేంపల్లి చెరువులో మొసలి

మల్లాపూర్, ఫిబ్రవరి, 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపల్లి గ్రామంలోని చెరువులో మొసలి ప్రత్యక్షమైంది. సోమవారం ఉదయం చెరువు ఒడ్డున మొసలి సంచరిస్తుండగా అటు వైపు వెళ్తున్న రైతులకు కనిపించడంతో వారు భయాందోళనలకు గురయ్యారు. నాలుగు రోజులు చెరువు పరిసరాల్లో మొసలి సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించి గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.



వేంపల్లిలోని చెరువులో మొసలి

గన్నేరువరం వీవోఏ తొలగింపు

గన్నేరువరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన హరిప్రియ గ్రామైక్య సంఘం వీవోఏగా విధులు నిర్వహిస్తున్న న్యాత పుష్పలతను విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం లావణ్య తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగుపథకాల గ్రామసభలో తాను ఉద్యోగురాలి నని మరచిన వీవోఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తనకు పథకాలు రాలే దంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో క్రమశిక్షణ రాహి త్యంగా వ్యవహరించినందుకు గాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించి ఆమెను విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం లావణ్య తెలిపారు.

కార్పొరేట్ శక్తులకు, ధనికులకు ఊతమిచ్చే బడ్జెట్

- బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు మొండి చేయి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి



మాట్లాడుతున్న శీలం స్వామి

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు ధనికులకు ఊతమిచ్చే బడ్జెట్ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో సోమవారం మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలను అణగదొక్కుతూ ధనవంతులను ఇంకా ధనికులుగా చేసే విధంగా ఉందని ఆరోపించారు. మధ్య తరగతి ప్రజల నుండి పన్నుల రూపేణా రూ 52 లక్షల65వేల 300 వసూలు చేసే దిశగా అడుగు పెట్టి అందులో నుండి పేదలకు 12లక్షలకోట్లు ఖర్చుపెట్టి మిగితా లక్షలకోట్లను దేశంలో ఉన్నటువంటి కార్పొరేట్ శక్తులకు, ధనవంతులకు, పారిశ్రామిక వేత్తలకు ఖర్చు చేసే దిశగా వెళుతున్నారన్నారు.దేశంలో బీసీ , ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను మోసం చేసే దిశగా బడ్జెట్ ఉందని జీఎస్టీ రూపంలో, ట్యాక్స్‌ల రూపంలో వేలకోట్లు కేంద్రం తీసుకుంటూ తెలంగాణకు మొండి చేయి చూపారన్నారు.

క్యాన్సర్‌ను జయిద్దాం

- ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రయోజనం
- వ్యాధిపై జాగ్రత్తలు అవసరం
- నేడు ప్రపంచ క్యాన్సర్ డే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

క్యాన్సర్ వచ్చింది.. ఇక జీవితం ముగిసి పోతుందని చింతించాల్సిన పని లేదు. గుండె నిబ్బరంతో పోరాటం చేయవచ్చు. అప్రమత్తతతో తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. ఎంతో మంది క్యాన్సర్ బారిన పడి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ తమ జీవితకాలాన్ని పొడిగించుకున్న వాళ్లు ఉన్నారు. పూర్తిగా క్యాన్సర్‌ను దూరం చేసిన వాళ్లూ ఉన్నారు. తొలిదశలో క్యాన్సర్‌ను గుర్తించకపోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నది వాస్తవమే. క్యాన్సర్ అంటే ఇక జీవితం నుంచి క్యాన్సిల్ కాదని వైద్య నిపుణులు చెపుతున్నారు. ప్రధానంగా నోటి క్యాన్సర్, గొంతు, ఊపిరి తిత్తులు, జీర్ణకోశ క్యాన్సర్‌తో మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. పురుషులు ఎక్కువగా పొగత్రాగడం, పొగాకు నమలడం, మద్య పానం వల్ల నోటి క్యాన్సర్ వస్తోంది.





క్యాన్సర్ అంటే..

శరీరంలో కణవిభజన నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఏ రకమైన కణాలు ఎంత వేగంగా విభ జన జరుగాలి. అనే దాన్ని కణం యొక్క కేంద్రంలోని క్రోమోజోముల్లోని ఒక జన్యువు ఉంటుంది. దీన్ని రెగ్యులేటర్ జీన్‌గా పిలుస్తారు. ఏ కారణం చేతనైనా ఈ రెగ్యూలేటర్ జీన్ మాట వినకపోతే కణాలు అదుపులేకుండా విభజన జరుగుతాయి. క్రమ పద్ధతి లేనందున కణాలకు రక్తం సరఫరా సరిగా ఉండదు. రక్తం సరిగా అందని ప్రాంతం కుల్లిపోవడం జరుగు తుంది. ఇది శరీరంలో ఏ అవయవానికైనా జరగ వచ్చు. దీన్ని క్యాన్సర్ లక్షణాలుగా చెప్పుకోవచ్చు. కొంత మంది కుటుంబంలో కొన్ని రకాల క్యాన్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా గుర్తించారు. వృత్తు ల వారీగా వస్తున్న క్యాన్సర్లు కూడా ఉన్నాయి. ఈ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే కొంత వరకైనా ప్రాణాలు కోల్పోకుండా రక్షించుకోవచ్చు.

నేపథ్యం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ క్యాన్సర్‌ను నివారించవచ్చని గుర్తించింది. 2000ల సంవత్స రంలో పారిస్‌లో జరిగిన సమావేశంలో ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపాలని నిర్ణయించారు. 2025లో 15 లక్షల కొత్త కేసులు నమోదు అవుతాయని భావిస్తున్నారు. కేసులు పెరుగుతున్న సందర్భంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర ్ణయించి అవగాహన కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 12శాతం ఉంది. రాబోయే 10సంవత్సరాల్లో 80మిలియన్ల మంది ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.

ఎలా వస్తుంది..

క్యాన్సర్ శరీరంలో ఏ అవయవానికైనా రావచ్చు. సాధారణంగా కొంత మంది కుటుం బంలో కొన్ని రకాల క్యా న్సర్లు కొన్ని తరాల నుంచి వస్తున్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అటువంటి వాళ్లను గుర్తించి ముందుగా పరీక్షలు చేయిస్తే కొంత మేరకు ప్రాణా లను రక్షించవచ్చు. గనుల పరిశ్రమ, పెయింటింగ్, రసాయనాల పరిశ్రమల్లో పనిచేసే వారికి క్యాన్సర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మనం తినే తిండి నీటిలో కలిసి ఉన్న రసాయనాలు కూడా క్యాన్సర్‌ను తెచ్చి పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పొగ తాగడం వల్ల ఊపిరి తిత్తుల్లో, అన్నవాహికకు, మల ద్వారం, ఇలా ఎక్కడైనా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిర్ధారణ అయ్యింది. వందలో 24శాతం పొట్టలో అన్న వాహికకు క్యాన్సర్లు వస్తున్నాయని, 16శాతం ఊపిరి తిత్తుల్లో, 15శాతం రొమ్ముకు, పేగు లకు, ఊపిరితి త్తులకు, రొమ్ములకు కలిసి 100లో 50శాతం క్యాన్సర్లు కనిపిస్తాయి. 13శాతం మూత్ర కోశం, మూత్ర పిండాలు, చర్మానికి 9శాతం, గర్భసంచి, గర్భసంచి ముఖ ద్వారంలో నూ, అండాశ యాల్లోనూ క్యాన్సర్ నూటికి 9వంతులు ఉంటుంది. మిగితా అన్ని అవయ వాలకు 14శాతం ఉంది.


లక్షణాలు..

క్యాన్సర్ గుర్తించడానికి కొన్ని లక్షణాలను గమనం లోకి తీసుకోవా లి. దగ్గితే రక్తం పడడం, మూత్రంలో రక్తం పడడం, మలంలో రక్తం కనిపించడం, మల విసర్జనలో మార్పు లు, యోనిద్వారంలో రక్తం పోవడం, బహి ష్టులో యోని ద్వారం గుండా రక్తం పోవడం, మెనోపాజ్ తరువాత రక్తం పోవ డం భార్య భర్తలు కలిసిన తరువాత రక్తం పోవడం, చాలా కాలంగా తగ్గకుండా ఉండే దగ్గు, రొమ్ములో గడ్డ, మెడలో గడ్డలు, చాలా కాలంగా మానకుండా ఉండే పుండ్లు, ఎలాంటి కారణం లేకుం డా అలసట, బరువు తగ్గి పోవడం, అన్నం తినలేక పోవడం వంటి లక్షణాలను బట్టి క్యాన్సర్‌ను కూడా అనుమానించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

క్యాన్సర్ నివారణ ప్రధానంగా మన చేతుల్లోనే ఉంది. పొగ తాగడం మానేయడం, ఎక్కువగా పీచు ఉండే పదార్థాలు తింటే పేగుల్లో క్యాన్సర్ రాకుండా నివారించుకోవచ్చు. పోషకాహారం తీసుకోవాలి. పెరిగే పిల్లలకు కాల్షియం అధికంగా ఉన్న ఆహార పదార్థాలు అవసరం. ఆకుకూరలు, ఇతర కూరలు, పండ్లు సమృద్ధిగా వాడాలి. విటమిన్-ఏ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తినాలి. వంట నూనెలు, మాంసం వంటి పదార్థాలు తగ్గించాలి. ఉప్పు పరిమితంగా వాడాలి. వనస్పతి, నెయ్యి, వెన్న చాలా అరుదుగా వాడుకోవాలి.





కార్పొరేట్, రియల్టర్లకు డిపాజిట్ దక్కద్దు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయఎమ్మెల్సీ స్థానానికి కార్పొరేట్ సంస్థలకు చెందిన వ్యక్తులు, రియల్ ఎస్టేట్ చేస్తున్న మిత్రులు పోటీ చేస్తున్నారని, వారికి డిపాజిట్ దక్కదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పనిచేసిన వారికే ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు తెలుస్తాయన్నారు. తాను 30సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా, జిల్లా నోడల్ అధికారిగా పనిచేశానని, ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీగా అనుభవం ఉందని అన్నారు. మండలస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తిగా తనకు ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలు పూర్తిస్థాయిలో తెలుసునన్నారు. అందుకనే ఇంటర్ జేఏసీ, ఎస్టీయూ జేఏసీ, తెలంగాణ పీఆర్‌టీయూ జేఏసీ పక్షాన, ఉపాధ్యాయ, అధ్యాపక ఉమ్మడి అభ్యర్థిగా మరోసారి నామినేషన్ వేసినట్లు చెప్పారు. మనఉన్నతికి ఉపాధ్యాయ వృత్తికి ఇంకా విలువతెచ్చుకోవాల్సిన అవసరం ఉందని, అందుకనే వారిని డిపాజిట్ లేకుండా ఓడించాలని అన్నారు.

దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం



నూతనంగా నిర్మితమయ్యే సహాయ కమిషనర్ కార్యాలయంలో ఏసీ నాయిని సుప్రియతో ఈవోలు, సిబ్బంది

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నూతన కార్యాలయ భవనం సోమవారం ప్రారంభమైంది. సుమారు 25 సంవత్సరాలుగా కోర్టు వద్ద రాజరాజేశ్వర కల్యాణమండపం మొదటిఅంతస్తులో కార్యకలాపాలు కొనసాగేవి. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాలు, సౌకర్యాల విషయాలను దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కల్యాణమండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చేందుకు నిర్ణయించారు. కొన్ని నెలలుగా అన్ని వసతులతో కూడిన నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా కొంతపని మిగిలి ఉండడంతో ఈ నెల12నుంచి కార్యాలయం పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. వసంతపంచమి సందర్భంగా భవనంలో సహాయ కమిషనర్ నాయిని సుప్రియ పుణ్యాహవాచనంలో పాల్గొన్నారు. భవనాన్ని ప్రారంభించి మొక్కను నాటారు.

జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పేసరి అజయ్(ఎస్సారార్ డిగ్రీకళాశాల), మనీషా, ప్రియాకుమారి(ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల) ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం చైర్మన్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. పశ్చిమగోదావరిజిల్లా నరసాపురంలోని వైఎన్‌రెడ్డి కళాశాలలో ఈనెల3నుంచి9వరకు కొనసాగేశిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50మందివలంటీర్లు పాల్గంటున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వలంటీర్లను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు పడాల తిరుపతి, సుజాత, అర్జున్, ఎలిజబెత్ రాణి, రాజేశం, రాపర్తిశ్రీనివాస్, సంగీతా రాణి, శ్రీలత అభినందించారు.



జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటున్న శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. నర్సక్కపేట గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు శ్రీనివాస్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే కాంగ్రెస్ వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాకపోవడం, పెట్టుబడి సాయం అందకపోవడంతోనే ఆత్మహత్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే అని, రైతులు మనోధైర్యం కోల్పోవద్దని బీఆర్ఎస్ అండ గా నిలుస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు జితేందర్‌గౌడ్, మీసరగండ్ల అనీల్‌కుమార్, గొట్టిపర్తి పర్శరాం, సావనపెల్లి అనీల్‌కుమార్, సాదుల్, రాగటి రమేష్, మల్యాల రాజశేఖర్, రాజారాం, కూనబోయిన రఘు, శ్రావణ్‌కుమార్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బీసీ కులగణన

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే తప్పుల తడకగా ఉందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1931 లెక్కల ప్రకారం దేశంలో 52శాతం బీసీలు ఉండగా, అప్పటినుంచి ఇప్పటివరకు బీసీల జనాభా పెరిగి 70శాతం చేరిందన్నారు. గతంలో బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుల సర్వేలో 58శాతం బీసీలను చూపించి మోసం చేయగా, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేసుకుంటూ వచ్చాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అయిలయ్యగౌడ్, సదానందంగౌడ్, అయిలయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు షురూ!

- తొలిరోజు పట్టభద్రుల స్థానానికి ఆరు..
- ఉపాధ్యాయ స్థానానికి మూడు నామినేషన్లు

కరీంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సోమవారం ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీకాగానే పట్టభద్రుల స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు, ఉపాధ్యాయుల స్థానానికి ముగ్గురు అభ్యర్థులు ఐదునామినేషన్లు వేశారు. వీరిలో ఇద్దరు అభ్యర్థులు పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలు రెండింటికి నామినేషన్ వేశారు. పట్టభద్రుల స్థానంలో సిలివేరి శ్రీకాంత్(జమ్మికుంట), గవ్వల లక్ష్మి (దేవునిగూడెం), చాలిక చంద్రశేఖర్(హైదరాబాద్), మంచికట్ల ఆశమ్మ(ఆదిలాబాద్), కంటెసాయన్న (మేడ్చల్), దూడ మహిపాల్(ధర్మపురి) నామినేషన్లు వేశారు. ఉపాధ్యాయుల స్థానానికి సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్, కూర రఘోత్తంరెడ్డి(గోనెపల్లి) నామినేషన్లు వేశారు. సిలివేరి శ్రీకాంత్, చాలిక చంద్రశేఖర్ అటు పట్టభద్రుల స్థానానికి, ఇటు ఉపాధ్యాయుల స్థానానికి నామినేషన్లను దాఖలు చేశారు. కరీంనగర్ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఈ నామినేషన్లను స్వీకరించారు.

● 10 వరకు నామినేషన్ల స్వీకరణ

ఎమ్మెల్సీ ఎన్నికలఅధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ ఈ రెండు ఎమ్మెల్సీస్థానాలకు తాను రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నానని, ఈనెల 10వతేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. 8,9 తేదీల్లో ప్రభుత్వ సెలవులు ఉండడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదని, మిగతా పనిదినాల్లో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని ఆమె తెలిపారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి పూర్తికాగానే ఫలితాలుప్రకటిస్తామని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సందేహాలను నివృత్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామని వివరించారు. అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, ర్యాలీలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు.

ధర్మపురిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

ధర్మపురి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి (యోగ,ఉగ్ర) వారల సేవలను మంగళవాయిద్యాలు వెంటరాగా పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇసుక స్తంభంవద్ద గల మండపంలో స్వామివారలను ఆశీనులు చేసి వేదమంత్రాల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. దూర ప్రాంతాలకు చెందిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.



ఇసుక స్తంభం వద్ద స్వామి వారలకు వసంతోత్సవ పూజలు



ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి వారలకు హారతి పూజలు

భక్త జనసంద్రంగా వేములవాడ

- భక్తులతో కిక్కిరిసిపోయిన లైన్‌లు ● 300 మంది వరకు శివదీక్ష తీసుకున్న భక్తులు



భక్తులతో రద్దీగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. వసంత పంచమిని పురస్కరించుకుని పరమశివుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 3 గంటల నుంచే శివదీక్ష స్వాములు రాజన్న దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం 4.30 గంటలనుంచి లోకల్ భక్తులు రాజన్నదర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరగా ఇతరప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చిన భక్తులు ముందుగా కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారు నాలుగు గంటల పాటు బారులు తీరారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతి పాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ ఏఈవో అశోక్ సూపరింటెండెంట్ వరి సర్వయ్య, నరేందర్, రాజేందర్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

మొదలైన శివదీక్షల స్వీకరణ..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలంలో శివదీక్షలు ప్రారంభమయ్యాయి. వసంత పంచమిని పురస్కరించుకుని శివభక్తులు సోమవారం తెల్లవారు జామున శ్రీరాజరాజేశ్వర స్వామి అభిషేక పూజలో పాల్గొని మాలాధారణ చేసుకునేందుకు తరలివచ్చారు. శివస్వాముల ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయ అభిషేక మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో దాదాపు 300మంది శివభక్తులు మాలధారణ ధరించారు.

ప్రతియేటా శివరాత్రి ముందు శివుడికి మండల, అర్ధ మండల దీక్ష మాలధారణ చేసి, శివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో మాల విరమణ చేస్తారని ప్రధాన అర్చకులు ఈశ్వరగారి సురేష్, వాసలమర్రి గోపి, తమ్మల భీమన్న తెలిపారు.

రేపు రాజన్న హుండీ లెక్కింపు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య ఉదయం 8 గంటల నుంచి హుండీలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు



రాజన్న ఆలయంలో శివదీక్ష స్వీకరిస్తున్న భక్తులు

సమస్యలను సత్వరమే పరిష్కరించండి


సమస్యలు వింటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


కలెక్టరేట్‌కు వచ్చిన ముస్తాబాద్ మండలం తుర్కాకాసీ కులస్థులు


కలెక్టరేట్‌కు వచ్చిన మిడ్‌మానేరు నిర్వాసితులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : (ఆంధ్రజ్యోతి), ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లు అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు జిల్లా కలెక్టరేట్‌కు తరలిచవ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో అదనంగా ఫిర్యాదులు వస్తున్న ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుల కోసం ఈఈ చెన్నయ్య, జిల్లా ఇన్‌చార్జి పంచాయితీ అధికారి శేషాద్రిలకు ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటుచేసి వీరితో పాటు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 122ధరఖాస్తులు వచ్చాయి. ఇందులో రెవెన్యూ శాఖకు 67, సిరిసిల్ల మున్సిపాల్టీకి 18, జిల్లా పంచాయతీ అధికారికి 2, జిల్లా వైద్యాధికారికి 2, జిల్లా సంక్షేమాధికారికి 4, చేనేత జౌళీశాఖకు 3, ఎస్సీ కార్పోరేషన్‌కు 1, ఎస్సీ సంక్షేమ అధికారికి 4, ఎస్‌డీసీకి 5, డీఆర్‌డీవోకు 2, వ్యవసాయశాఖకు 2, పౌరసరఫరాల శాఖకు 3, విద్యాశాఖకు 1, మత్స్యశాఖకు 1, నీటిపారుదల శాఖకు 1, ఎస్సీ కి 1, ఉపాధి కల్పన శాఖకు1, కోనరావుపేట ఎంపీడీవోకు1, ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోకు1, గంభీరావుపేట ఎంపీడీవోకు 1, తంగళ్ల పల్లి ఎంపీడీవోకు 1 చోప్పున ఫిర్యాదు, వినతి పత్రాలు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాపడంతో పాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల పట్టణంలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. అలాగే పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో అక్రమణగురైన భూములను సైతం పరిరక్షించాలని కోరారు.

సాగుచేసుకుంటున్న భూముల్లోకి రానీయడం లేదు

ముస్తాబాద్‌మండలం బందనకల్ గ్రామంలో సర్వేనంబర్ 798లో ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ భూములను గత 40 సంవత్సరాలనుంచి తుర్కాకాశీకులానికి చెందిన కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవిస్తుండగా ఐదు సంవత్సరాల నుంచి ఆ భూములను సాగుచేయవద్దని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి అడ్డుకోవడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతుండడంతో దీనిపై గత పదిసార్లు జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులను కలిపి ఫిర్యాదులు చేసిన ఎలాంటి స్పందన లేకుండాపోయింది. ఇప్పట్కైనా జిల్లా కలెక్టర్ స్పందించి తాము సాగుచేసుకుంటున్న భూములను పరిశీలించి మా నిరుపేదలకు పట్టాలను అందించాలని తుర్కాకాశీ సంఘానికి చెందిన సయ్యద్ ఖాసీం, సయ్యద్ మదల్, సయ్యద్ కాశీంబీలు కోరారు.

ఇళ్లస్థలాలతోపాటు కుటుంబ ప్యాకేజీ నష్టపరిహారం అందించాలి

మిడ్‌మానేరు జలాశయంలో ముంపునకు గురైన వేములవాడ రూరల్ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన నిర్వాసితులమైన మాకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇళ్లస్థలాలతో పాటు కుటుంబ ప్యాకేజీ డబ్బులు చెల్లించాలంటూ పలువురు నిర్వాసితులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చీర్లవంచ గ్రామానికి చెందిన చల్ల ఉపేందర్, ఇర్నాల సారయ్య, ఇర్నాల తిరుపతి, ఇర్నాల రాజవ్వ, చల్ల నర్సయ్య, చల్ల రవి, ఇసుకొండ లింగయ్య, ఇనుకొండ తిరుపతి, ఇనుకొండ నరహరి, ఇనుకొండ లక్ష్మణ్, ఇనుకొండ నర్సింహులు, చల్ల బాలరాజులు తమకు నష్టపరిహారంతో పాటు ఇళ్ల స్థలాలను ఇప్పించాలంటూ కోరారు.

శివంగాళపల్లిలోని కుమ్మరిగుట్టను కాపాడాలి

కోనరావుపేట మండలంలోని శివంగాల పల్లె శివారులోఉన్న కుమ్మరిగుట్ట పనులను తాత్కాలికంగా నిలిపివేయించి ఆ గుట్టను కాపాడాలంటూ గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ సురేష్‌యాదవ్‌తో పాటు గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామా శివారులోని సర్వే నంబర్ 17లో ఉన్న కుమ్మరి గుట్ట ప్రాంతాన్ని కోనరావుపేట గ్రామానికి చెందిన అముద రాజు అనే వ్యక్తి చట్టానికి వ్యతిరేకంగా అక్రమంగా చదును చేస్తున్నాడని దీనిపై గత వారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. గత వారం రోజులనుంచి భారీ యంత్రాలను ఏర్పాటు చేసి గుట్టను చదును చేస్తున్నారని దీనిని పరిశీలించి గుట్టను కాపాడాలని కోరారు.

రోడ్డును ఆక్రమించారు

- ఎర్రం విజయరామరాజు, సిరిసిల్ల



సిరిసిల్ల పట్టణంలోని మాస్టర్ ప్లాన్‌లో ఉన్న 33 ఫీట్ల రోడ్డుని రైస్‌మిల్లర్లు, మార్బుల్‌దుకాణదారులు ఆక్రమించుకుని రోడ్డును పూర్తిగా మూసివేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆ రోడ్డును వినియోగంలోకి తీసుకరావాలి.

ప్రధానమంత్రి కిసాన్ యోజన అందించాలి

- నాగుల రాజయ్య, విలాసాగర్, బోయిన్‌పల్లి



బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నాకు సర్వేనంబర్‌లు 465/బీ, 995 / బీ/అలో ఉన్న ఎకరం 22 గుంటల భూమిని సాగుచేసుకుంటున్నాను, నాకు ఇప్పటి వరకు ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం వర్తించకపోవడంతో నాకు రైతులకు అందించే ఆర్థిక సాయం అందడం లేదు. అధికారులు స్పందించి ఆ పథకాన్ని అందించి ఆదుకోవాలి.

ముంపు భూమికి నష్టపరిహారం చెల్లించాలి

- బుర్ర మల్లేశంగౌడ్, ధర్మారం, కోనరావుపేట



కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామ శివారులో నిర్మించిన రిజర్వాయర్‌లో సర్వే నంబర్ 820/ 1/4లో ఉన్న రెండు ఎకరాల భూమి ముంపునకు గురైంది. అ భూమికి నష్టపరిహారం చెల్లించాలంటూ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి స్పందన లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్ స్పందించి ముంపునకు గురైన భూమికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

సాగు చేయకుండా అడ్డుకుంటున్నాడు

- గుండెల్లి నర్సయ్య, కోళ్లమద్ది, గంభీరావుపేట



గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామంలో సర్వేనంబర్ 113లో ఉన్న 2.2 ఎకరాల భూమిలో సాగు చేయకుండా గ్రామ మాజీ సర్పంచ్ అడ్డుకుంటున్నాడని దీనిపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేకుండా పోయింది. సాగు చేయకుండా అడ్డుకోవడంతో మా కుటుంబానికి ఎలాంటి ఉపాధి లేకుండా పోయింది. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి నాకు న్యాయం చేయాలి.

నేతన్నలు యజమానులుగా మారేనా

(5వ పేజీ తరువాయి)

నమూనాగా ఏర్పాటు చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద 88 ఎకరాల్లో రూ 374 కోట్లతో వీవింగ్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదటి విడతలో 1,104 మంది కార్మికులకు వర్క్‌షెడ్లను నిర్మించి అందించాలనే లక్ష్యంగా పనులు ప్రారంభించారు. రోడ్లు, నీటి వసతి, కరెంట్, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించారు. 46 వర్క్‌షెడ్లను నిర్మించాలనే లక్ష్యంగా పెట్టుకుని 42 షెడ్లు పూర్తి చేశారు. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4,416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించనున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్‌రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమి ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం, ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర 8 లక్షలుగా ముందుగా నిర్ణయించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.16.52 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో 10 శాతం లబ్ధిదారుని వాటాధనం 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకానికి రూప కల్పన చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం పెరిగిన బడ్జెట్‌కు అనుగుణంగా రూ 386.88 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేయనుండడంతో కార్మికుల్లో ఆశలు చిగురించాయి.

కొందరికే మగ్గాలు..

సిరిసిల్లలో ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మర మగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6,500 మంది పనిచేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో ఆరు వేల మంది వరకు పనిచేస్తున్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1,104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది.

చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

● సర్దాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన సర్దాపూర్ ముదిరాజ్ సంఘు నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ గ్రామ శివారులో ఉన్న జనగలకుంట, తూంకుంట గొలుసు చెరువులను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆ చెరువులను పరిరక్షించాలని సర్దాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాండ్ల రామచంద్రం, నిమ్మల పర్శరాములు కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు సోమమవారం ముదిరాజ్ సంఘం నాయకులు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామా శివారులో ఉన్న గొలుసు కట్టు చెరువులను గ్రామానికి చెందిన జీర్ర జనార్దన్, జీర్ర రమేష్, జీర్ర పర్శయ్య అక్రమంగా ఆక్రమించుకుని ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారని అంతేకాకుండా చెరువు కట్టలను తొలగించడంతో పాటు చెరువును పూడ్చివేయడం జరుగుతుందన్నారు. ఈ చెరువులను పరిశీలించి ముదిరాజ్ కులస్థులకు జీవనాధారమైన చెరువుల్లో చేపల పెంప కానికి వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల లక్ష్మణ్, తిరుపతి, వెంకటేష్, నర్సయ్య, పోచయ్య, నర్సయ్య, దేవయ్య, నిమ్మల శ్రీనివాస్, పెరుమాండ్ల నాంపెల్లి పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (అంధ్రజ్యోతి): అంటరానితనం నిర్మూలన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాలను నిరోధించడంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకరావడానికి ఏర్పాటు చేసిన పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందించారు. ప్రతి నెల 30వ తేదీన పౌరహక్కుల దినోత్సవాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, లంబాడ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్, జింక శ్రీధర్ పాల్గొన్నారు.

కమనీయం.. రాధాకృష్ణుల కల్యాణం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని గీతా మందిరం వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా వేద పండితుడు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలోని పురోహితులు రవీందర్‌శర్మ, మణికంఠశర్మ, గోపాలకృష్ణాచార్యులు, నర్సింహాచార్యులు రాధాకృష్ణుల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం స్వామి రథోత్సవం నిర్వహించారు. సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, సభ్యులు రాంరెడ్డి, శ్రీకర్ ఉన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం

కోనరావుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సమస్యల కోసం పోరాడే శక్తి ఎస్ఎఫ్ఐకే ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మండల మహాసభను స్థానిక ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో చెల్మాల రాహుల్, పిట్టల రాకేష్, ప్రవీణ్, మహ్మద్ షాదుల్ల, షఫీ, జశ్వంత్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని పీపుల్స్ హాస్పిటల్ నిర్వాహకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ రాజారాంలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. గూడెం గ్రామంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి దాదాపు 1500 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసిన సందర్భంగా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎఎంసీ చైర్మన్ అంజనేయరావు, మాజీ ఎంపీటీసీలు గుండెల్లి శ్రీనివాస్, బొప్ప శ్రీధర్, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ సిద్ధి యోగ ఉత్సవాలు

గంభీరావుపేట ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్ధియోగ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామదేవతలకు బోనాలు, ఎల్లమ్మను ఎదుర్కొనుట కార్యక్రమాలను నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముస్తాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలో బిట్ల సంతోష్ అనే వ్యక్తి మృతి చెందగా బాధిత కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం అందించారు. ఎండీ సర్వర్‌రూ 2వేలు ఎద్దండి నర్సింహారెడ్డి, రూ 3వేలు, బండారి రమేశ్ రూ 1000, కొండాపూర్ రాజు రూ 1000, శ్రీనివాస్ ఇండస్ట్రీస్ రూ 2వేలు, కుంబాల యాదగిరి రెడ్డి, రూ 500, గుర్రాల శ్రీని వాస్‌రెడ్డి రూ 500, దీటి ఎల్లం రూ 500, పర్శ తిరుపతి రూ 1000లను బాధిత కుటుంబానికి అందించారు.

ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు

రుద్రంగి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో ఓ ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్‌తో ఓ బాలికకు ఇన్‌ఫెక్షన్ అయింది. బాలికను కుటుంబ సభ్యులు కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి కాలుకు శస్త్రచికిత్స చేయించారు. ఈ విషయం వైద్యశాఖ అధికారులకు తెలియడంతో వారి ఆదేశాల మేరకు ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్‌ను సోమవారం మండల వైద్యాధికారి వేదచారి సీజ్ చేశారు.

స్వీపర్లు, స్కావెంజర్లకు వేతనాలు అందించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్‌లు, నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (అంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా నేరుగా వేతనాలను వారి ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమచేసి నాలువ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్ స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ యాదవ్, సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవిలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్, స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టరే ట్‌కు తరలివచి కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, స్కాంవె జర్లకు ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వీరికి నేరుగా ఖాతాలల్లోనే వేతనాలను వేసి అందించడంతో పాటు చీపుర్లు, బ్లీచింగ్ పౌడర్‌లతో పాటు ఫినాయిల్, గ్లౌజ్‌లను అందించాలన్నారు. సంవత్సరానికి 2జతల యూనిఫాంలతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించి పదవీవిరమణ బెనిఫిట్‌లు రూ. 4లక్షలు ఇవ్వాలన్నారు. కార్మికులను అక్రమంగా తొలగించారదని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అందించి పీఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని అన్నారు. ప్రతి నెల 5వ తేదీన వేతనాలు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. వారి సమస్యలను పరిష్క రించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో- కన్వీనర్ బోడ్డు నర్సవ్వ, పర్శరాములు, లక్ష్మీయ్య, రాజశేఖర్, అంజవ్వ, భూమవ్వ, చంద్రకళ, భూలక్ష్మీ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


సిరిసిల్లలో వసంత పంచమి వేడుకలు


ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో



రుద్రంగిలో పూజలు చేస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అశోక్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలతో పాటు ఇంగ్లీష్ యూనియన్ హైస్కుల్, తక్షశీల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, లలో సోమవారం వసంత పంచమిని పురష్కరించుకుని అక్షరాభ్యాస కార్యక్రమాన్ని వేదపండితులతో చేయించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు చిన్నారులకు పూలమాలలు వేసి పలక, బలపంతో అక్షరాభ్యాసం చేయించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వివేకానంద విద్యానికేతన్ కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చారావు, మహేందర్‌రెడ్డి, ఇంగ్లీష్ యూనియన్ హైస్కుల్ కరస్పాండెంట్ రాజు, శ్రీకృష్ణవేణి ఇంగ్లీష్ హైస్కుల్ కరస్పాండెంట్ పల్లె రాజు, తక్షశీల ఇంగ్లీష్ మీడియం హైస్కుల్ కరస్పాండెంట్ మడుపు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు అల్మాస్‌పూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని ఆలయాలు, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రైవేటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సరస్వతి చిత్ర పటాలకు పూజలు జరిపారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలోని ప్రైవేటు పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహాలకు పూలమాలలు వేశారు. పిల్లలకు అక్షరాభాస్యం చేయించగా, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తూముకుంట శ్రీనిధి, పండరీనాథ్, శ్రీరాముల శ్రీధర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముస్తాబాద్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని నవజ్యోతి ఇంగ్లీష్ మీడియం, మహర్షి ఇంగ్లీష్, మీడియం, శాంతి నికేతన్, శ్రీవాణి పబ్లిక్ స్కూల్, రాఘవేంద్ర స్కూల్‌లో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోర్రాయిపల్లెదారిలో గల సరస్వతీ ఆలయానికి భక్తులు, విద్యార్థులు బారులు తీరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల నిర్వాహకులు కెజె ప్రకాశ్, జలజ రాంమోహన్‌రావు, స్రవంతిరెడ్డి, దొరగొల్ల బాలయ్య, సుధారెడ్డి, ఉత్పల, శ్రీను, మల్లారపు సంతోష్‌రెడ్డి, మంజుల ఉన్నారు.

● రుద్రంగి: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో కర్సస్పాడెంట్ ఎలిగేటి నరేష్, డైరె క్టర్‌లు తిపిరెడ్డి వేంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు ఉన్నారు.

● చందుర్తి: చందుర్తి మండలం బండపల్లి, మల్యాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుర్ర రేణుక,మంజుల సంధ్య, అనిత, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో సోమవారం వరల్డ్ ఎన్విరార్‌మెంట్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరిక్షంలో మొక్కలు పెంచాల్సి వస్తే నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని సెలెస్టియల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తాళ్లపల్లి అర్చన, సాప మేఘన, బండారి లావణ్యలు గెలుపొందగా వారికి సర్టిఫికెట్‌లను తాజా మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీడింగ్ క్లబ్ ప్రారంభం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మండలం శాత్రాజుపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రీడింగ్ క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. రీడింగ్ క్లబ్‌ను ప్రముఖ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ రీడింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఓ. లావణ్య వైస్ ప్రిన్సిపల్ సుమలత, లైబ్రేరియన్ శ్రీలత,అధ్యాపకులు ఉన్నారు.

అండగా ఉంటాం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జవారిపేట గ్రామ బీజేపీ నాయకుడు కంపెల్లి బాబు కుటుంబానికి అండగా ఉంటామని మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్ కుమార్ పేర్కొన్నారు. బాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబీకులను సోమవారం పరామర్శించారు. దూది సుధీర్‌రెడ్డి, బోళ్ల రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, నారాయణ ఉన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గం ఎన్నిక

రుద్రంగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దేశవేని భూమేష్, ఉపాధ్యక్షులు తన్నీరు వేణు, కోశాధికారి పడాల శ్రీధర్, కార్యదర్శి హోమాల అశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పిఎంపి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

కబ్జాకు గురైన భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలి

చందుర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పరుశురాం అన్నారు. ప్రజావాణిలో చందుర్తి తహసీల్దార్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.